సాక్షి
తూర్పుగోదావరి
శనివారం । 18 । నవంబర్ । 2023



ఆయుష్మాన్‌భవ!


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఆయుష్ ఆస్పత్రుల భవనాలను పూర్తి స్థాయిలో ఆధునీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. - 8లో▸



...రోజునే రైతుకు చెల్లింపు

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి, ఆన్‌లైన్ చేయించుకున్న రోజునే రైతులకు సొమ్ములు చెల్లిస్తామని పౌర సరఫరాల కార్పొరేషన్ ఎండీ వీరపాండ్యన్ అన్నారు. - 8లో▸

7వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు శుక్రవారం 7 వేల క్యూసెక్కుల గోదావరి జలాలను విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,600, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

డిసెంబర్ 9న జాతీయ మెగా లోక్ అదాలత్



కె.శ్రీనివాసరావు

కొవ్వూరు: కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో డిసెంబరు 9న జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన కొవ్వూరులో విలేకర్లతో మాట్లాడారు. రాజీ పడదగిన అన్ని రకాల కేసులను పరిష్కరించుకోవచ్చునన్నారు. సివిల్ ,క్రిమినల్ కేసులతో పాటు చెక్ బౌన్స్, వాహన ప్రమాదాలు, ప్రీ-లిటిగేషన్ ,బీఎస్ఎన్ఎల్ కేసులు రాజీ చేసుకోవచ్చునని సూచించారు.లోక్ అదాలత్ పరిష్కరించుకున్న కేసులపై అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండదన్నారు. కోర్టు ఖర్చులు,సమయం ఆదా చేసుకోవచ్చునని సూచించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు.

ఏసీబీ వలలో సామర్లకోట ఆర్ఐ

రూ.8వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం



ఏసీబీకి చిక్కిన ఆర్ఐ దుర్గాబాలాజీ (తెల్లచొక్కా ధరించిన వ్యక్తి) అతడి ప్రైవేటు అసిస్టెంట్ చిన్న

కాకినాడ క్రైం: సామర్లకోట తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ)గా పనిచేస్తున్న దుర్గా బాలాజీ అవినీతి నిరోధకశాఖ అధికారులకు చిక్కాడు. ఏసీబీ అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య తెలిపిన వివరాల మేరకు సామర్లకోట మండలం పనసపాడు గ్రామానికి చెందిన అవసరాల రామలక్ష్మి అనే మహిళ కొద్ది రోజుల క్రితం మండల రెవెన్యూ కార్యాలయంలో ఫ్యామిలీ మెంబర్, బర్త్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంది. వాటిని మంజూరు చేసేందుకు రూ.10వేలు లంచం ఇవ్వాలంటూ ఆర్ఐ బాలాజీ డిమాండ్ చేశాడు. దీంతో ఆమె ఏసీబీ అధికారులను ఆశ్రయించింది.

వారి సూచనల మేరకు రామలక్ష్మి కాకినాడ రామారావుపేటలో నివాసం ఉంటున్న ఆర్ఐ బాలాజీని అదే ప్రాంతంలో అతని డయాగ్నస్టిక్ సెంటర్ (డీకే డైయాగ్నక్‌సెంటర్) లో శుక్రవారం రాత్రి కలిసింది. ఆర్ఐ ప్రైవేటు అసిస్టెంట్ చిన్న ద్వారా బేరసారాలు అనంతరం రూ. 8వేలు లంచంగా తీసుకున్నాడు. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు లంచం సొమ్మును స్వాధీనం చేసుకుని ఆర్ఐని అదుపులోకి తీసుకున్నారు. దాడిలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు వాసుకృష్ణ, బి శ్రీనివాస్, ఎస్ఐ నిల్సన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి విస్తృతం..!

- జిల్లాలో జోరుగా సాగుతున్న పనులు
- అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి చూపుతున్న అధికారులు
- ఈ ఏడాది రికార్డు స్థాయిలో ఉపాధి కల్పన
- 2023-24 సంవత్సరానికి 58 లక్షల పనిదినాలు లక్ష్యం

సాక్షి, రాజమహేంద్రవరం: వలసలు నియంత్రించి ఉన్న ఊళ్లోనే పని కల్పించేందుకు ఉద్దేశించిన ఉపాధి పథకం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అమలవుతోంది. పని కావాలని అడిగిన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం పనులు చూపుతోంది. పథకంలో వ్యవసాయ అనుబంధ, అభివృద్ధి పనులకు ప్రాధాన్యం కల్పిస్తోంది. కూలీలు చేపట్టే వాటికి మొదటి ప్రాధాన్యత కల్పిస్తోంది. మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణం చేపడుతోంది. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లీనిక్, పాలకేంద్రం, డిజిటల్ లైబ్రరీలు, రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు చేపడుతున్నారు. పండ్లతోటల అభివృద్ధికి అండగా ఈ పథకం నిలుస్తోంది. పనులు చేసిన వెంటనే బిల్లులు జమ అవుతుండటంతో కూలీల సంఖ్య పెరుగుతోంది. రోజూ 60 వేల మందికి పైగా ఉపాధి పొందుతున్నారంటే పరిస్థితి అర్థం అవుతోంది. సాధారణంగా వేసవిలో ఉపాధికి డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం వ్యవసాయ పనుల సీజన్ అయినా ఆదరణ తగ్గడం లేదు.

58 లక్షల పనిదినాలే లక్ష్యం:

జిల్లా వ్యాప్తంగా 2023-2024 సంవత్సరంలో 58 లక్షల పనిదినాలు కల్పించాలని డ్వామా అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇప్పటికే 39.91 లక్షలు పూర్తి చేశారు. 68.81 శాతం లక్ష్యాన్ని అధిగమించారు. మిగిలిన 18 లక్షల పనిదినాలు నిర్దేశించిన సమయం లోపు పూర్తి చేసేందుకు శ్రమిస్తున్నారు. రాబోయే ఐదు మాసాల్లో వంద శాతం అమలయ్యేలా
అడిగిన వారందరికీ పని కల్పించనున్నారు.



చాగల్లు మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

1,83,835 జాబ్‌కార్డులు జారీ చేశారు. రోజుకు ఒక్కో కూలీకి సగటు వేతనం రూ.236.75 అందజేస్తున్నారు. 1163 కుటుంబాలకు 100 రోజుల పని చూపారు. పథకంలో బడుగులకు అగ్రపీఠం వేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరుగా పనులు చూపుతున్నారు. ఇప్పటి వరకు 66.26 శాతం ఎస్సీ కుటుంబాలకు, 69.31 శాతం ఎస్టీ కుటుంబాలకు ఉపాధి చూపినట్లు డ్వామా అధికారుల గణాంకాలు స్పష్టం చేస్తున్నారు.

రూ.152.13 కోట్లు వెచ్చింపు:

2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనులు వేగవంతంగా జరుగుతున్నారు. కూలీలతో చేపట్టే పనులే కాకుండా, మెటీరియల్ కాంపొనెంట్ ద్వారా అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇప్పటి వరకు రూ.152.13 కోట్లు వెచ్చించారు. వేతన ఖర్చు కింద కూలీలకు రూ.94.49 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్‌లో భాగంగా రూ.50.50 కోట్లు ఖర్చు చేశారు. రూ.7.14 కోట్లు పరిపాలన ఖర్చుకు వెచ్చించారు. మెటీరియల్ కాంపోనెంట్ నిధులు వినియోగించి గ్రామాల్లో ప్రధాన్యత భవనాల నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇప్పటికే ఇవి సింహభాగం తుదిరూపు దిద్దుకోగా.. మిగిలినవి యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

- ప్రతి మండలానికి రూ.60 లక్షల నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణాలకు రూ.10.80 కోట్లు వెచ్చించనున్నారు. వెరసి చిన్న, సన్నకారు రైతులు సైతం ఉపాధి పొందుతున్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు సమకూరుతున్నాయి.

అక్రమాలకు ఆస్కారం లేకుండా:

ఉపాధిలో అక్రమాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు పథకంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పథకం ఇష్టానుసారంగా అమలయ్యేది. పనులకు 200 మంది హాజరైతే 400 మంది అని దొంగ మస్టర్లు వేసి మరీ నిధులు నొక్కేసిన సందర్భాలు అనేకం. మెటీరియల్ కాంపొనెంట్ పనుల్లో అడ్డగోలు దోపిడీకి తెర తీశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటికి చెక్ పెట్టింది. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా మస్టర్ వేస్తున్నారు. తద్వారా రోజుకు రెండు సార్లు హాజరు వేస్తుండటం, హాజరును లైవ్ టెలీకాస్ట్ చేస్తుండటంతో అక్రమాలకు అడ్డుకట్ట పడుతోంది. కూలీలకు వేతనాలు చెల్లించడంలోనూ పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నారు. జాబ్‌కార్డుకు ఆధార్, మొబైల్ నంబరు, బ్యాంకు ఖాతాను లింక్ చేస్తున్నారు. వెరసి నిధుల దోపిడీకి అడ్డుకట్ట పడింది.

29,240 పనుల గుర్తింపు

వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పథకం ద్వారా 29,240 పనులు చేపట్టాలని డ్వామా అధికారులు లక్ష్యాలు నిర్దేశించుకున్నారు. ఇప్పటికే అమృత్ సరోవర్‌లో భాగంగా 75 చెరువుల అభివృద్ధికి సంబంధించిన పనులు వంద శాతం పూర్తి చేశారు.

- గృహ నిర్మాణానికి 90 పనిదినాలకు సంబంధించిన పనులు చేపడుతున్నారు. నీటి పారుదలకు ఆటకం కలగకుండా చెరువుల్లో పూడికతీత, పంట, పిల్ల కాలువల పూడిక తీత, గ్రామీణ రహదారుల అనుసంధాన, హార్టికల్చర్, ఎవెన్యూ ప్లాంటేషన్, హౌసింగ్ కాలనీల్లో మ్యాజిక్ సోక్ పిట్స్, గ్రామీణ ప్రాంతాల్లో మురుగు నీరు బయటకు వెళ్లేలా కమ్యూనిటీ సోక్ పిట్స్ పనులు చేపడుతున్నారు.
- ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో నీటి సంరక్షణకోసం 'రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్' లాంటి వాటికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నారు.
- జిల్లా భౌగోళికంగా డెల్టా, మెట్ట ప్రాంతాలు కలిసి ఉండటం వల్ల మెట్ట ప్రాంత మండలాల్లో నీటి సంరక్షణ, హార్టికల్చర్ ప్లాంటేషన్ ద్వారా ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తున్నారు.
- రైతులకు అధిక లాభాలు అందించే 'డ్రాగాన్ ఫ్రూట్' సాగును ప్రోత్సహిస్తున్నారు. నల్లజర్ల, గోపాలపురం, పెరవలి మండలాల్లో వీటి సాగును విస్తృతం చేస్తున్నారు.



జిల్లాలో (2023-24) పనిదినాల కల్పన లక్ష్యం	:58 లక్షలు
ఇప్పటి వరకు పూర్తయిన పనిదినాలు	:39.91 లక్షలు (68.81 శాతం)
కుటుంబానికి సగటు పనిదినాలు	:43.27
కూలీకి రోజుకు సగటు వేతనం	:రూ.236.75
100 రోజులు పూర్తయిన కుటుంబాలు	:1163
3 రోజుల్లో పేమెంట్ జనరేట్ శాతం	:100
మొత్తం ఖర్చు	:రూ.152.13 కోట్లు

లక్ష్యాలను అధిగమిస్తాం



ఉపాధి పనులు జిల్లాలో చురుగ్గా జరుగుతున్నాయి. 2024 ఆర్థిక సంవత్సరంలో 58 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నాం. అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పిస్తుండటం, బిల్లులు సైతం సకాలంలో జమ చేస్తుండటంతో పథకానికి ఆదరణ పెరుగుతోంది. 68 శాతం లక్ష్యాన్ని అధిగమించాం. మిగిలిన వాటిని సైతం పూర్తి చేసి వంద శాతం లక్ష్యాన్ని సాధిస్తాం. కూలీలతో పాటు, మెటీరియల్ కంపోనెంట్ పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నాం.

పి.జగదాంబ, పీడీ డ్వామా

గట్టెక్కించారు

సాక్షి, అమలాపురం: ఈ ఏడాది నైరుతితో పాటు ఈశాన్యం కూడా ముఖం చాటేసింది. అడపాదడపా వర్షాలు కురిసినా జూన్ నుంచి నవంబర్ వరకూ లోటు వర్షపాతమే. మరోవైపు జూలై తప్ప మిగిలిన నెలల్లో గోదావరిలో వరద జాడే లేదు. అయినప్పటికీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పోలవరం దిగువన ఉన్న ఎత్తిపోతల పథకాల నుంచి ధవళేశ్వరం బ్యారేజీ వరకూ అందరికీ గోదావరి నీరే శరణ్యమైంది. వర్షాలు తగినంతగా కురవకపోవడంతో ఇవ్వాల్సిన నీటికన్నా అదనంగా అందించాల్సిన పరిస్థితి. ముఖ్యంగా గోదావరి డెల్టా ఆయకట్టుకు అదనంగా నీరు ఇవ్వాల్సి వచ్చింది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జలవనరుల శాఖ అధికారులు ప్రణాళికాబద్ధంగా నీటిని విడుదల చేసి ఖరీఫ్‌ను ఎట్టకేలకు గట్టెక్కించారు.

వరుణుడు ముఖం చాటేసినా..

రాష్ట్రానికి అన్నపూర్ణగా పేరొందిన ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో మూడు వంతులు పైగా ఆయకట్టు గోదావరి డెల్టాలోనే ఉంది. ఇక్కడ ఈ ఖరీఫ్‌లో వరికోతలు ఇప్పటికే ఆరంభమయ్యాయి. ఈ ఏడాది వర్షాలు తగినంతగా కురవనప్పటికీ అధిక దిగుబడులు వస్తూండటం విశేషం. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలోని గోదావరి డెల్టా కాలువల కింద సుమారు 3.90 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు జరుగుతోంది. ఇక్కడ సగటున 34 బస్తాల (బస్తా 75 కేజీలు) నుంచి 48 బస్తాల వరకూ ధాన్యం దిగుబడి వస్తోంది. డెల్టా ఎగువన, దిగువన ఎకరాకు సగటు 39 బస్తాలు అనుకుంటే ఈ మూడు జిల్లాల్లో కలిపి ఒక్క డెల్టా ఆయకట్టులో 11.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడిగా వస్తోందని అంచనా.

అంతకు మించి..

సాధారణంగా గోదావరి డెల్టాలో ఒక టీఎంసీతో సుమారు 10,800 ఎకరాలు సాగు చేయవచ్చు. రబీలో 90 టీఎంసీల లభ్యత ఉంటే ఎద్దడి లేకుండా సాగు నీరు సరఫరా అందిస్తారు. ఖరీఫ్‌లో మాత్రం సాగు అధికంగా ఉన్నందున కనీసం 110 టీఎంసీల నీటి సరఫరాకు అధికారులు చర్యలు తీసుకుంటారు. మరీ వర్షాభావ పరిస్థితులు తలెత్తితే కనీసం 125 టీఎంసీల నీరు అందిస్తారు. కానీ ఈసారి అంతకు మించి అసాధారణంగా మూడు డెల్టాలకూ కలిపి ఖరీఫ్ షెడ్యూలు ముగిసిన ఈ నెల 15వ తేదీ వరకూ ఏకంగా 156.614



టీఎంసీల నీటిని సరఫరా చేయడం విశేషం.

3 వేల టీఎంసీలే

ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఈ ఏడాది ఇన్‌ఫ్లో తక్కువగా నమోదైన విషయం తెలిసిందే. జూలైలో వరద వచ్చినప్పటికీ ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఆ జాడే లేదు. జూన్ ఒకటో తేదీ నుంచి శుక్రవారం వరకూ గోదావరిలో మొత్తం 2,958.08 టీఎంసీల మేర జలాలు నమోదు కావడం గమనార్హం. డెల్టా పంట కాలువలకు 157.284 టీఎంసీల నీరు విడుదల చేయగా, బ్యారేజీ నుంచి సముద్రంలోకి 2,795.256 టీఎంసీల నీరు విడిచిపెట్టారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో 7 వేల క్యూసెక్కులు కాగా, దీనిలో సీలేరు పవర్ జనరేషన్ నుంచి 3,666 క్యూసెక్కులు వస్తున్నాయి. సహజ జలాలు 3,334 క్యూసెక్కులు మాత్రమే ఉన్నాయి. వరికోతలు ఆరంభమైనందున ఇటీవల నీటి విడుదలను తగ్గించిన అధికారులు.. ముందస్తు రబీ ప్రోత్సాహంలో భాగంగా నీటి విడుదలను మళ్లీ పెంచారు.

ఓటు నమోదుకు యువత ముందుకు రావాలి

జిల్లా కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ఓటుహక్కు లేనివారు నమోదుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కలెక్టర్ మాధవీలత కోరారు. రాజమహేంద్రవరంలోని వై జంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన ఓటరు అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా కియోస్కోను ప్రారంభించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మాధవీలత మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువత తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలన్నారు. బీఎల్ఓలు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జాబితాలో పేరు నమోదు అయిందో లేదో సరి చూసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఓటు లేకపోతే ఫారం-6 ద్వారా నమోదు కావాలన్నారు. చిరునామా మారిన సందర్భంలో ఓటును కూడా మార్చుకోవాలన్నారు. ఇందుకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పారదర్శకతతో కూడిన ఓటరు జాబితా రూపొందించాలన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో ముఖ్యమైన 8 కూడళ్లలో కియోస్కోలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ చురుగ్గా పాల్గొనాలని జాయింట్ కలెక్టర్ ఎస్ తేజ్ భరత్ పిలుపునిచ్చారు. మునిసిపల్ కమిషనర్ కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ ఓటు లేని వారు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీపీవో జేవి సత్యనారాయణ, అదనపు కమిషనర్ సత్య వేణి, జిల్లా అధికారులు, కాలేజీ, మునిసిపల్ స్కూల్ విద్యార్థులు, ఆర్ ఎం సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సరికొత్త ఘట్టం ఆవిష్కృతం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు. చిత్రంలో ఎంపీ భరత్ రామ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా, ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, కలెక్టర్ మాధవీలత, అధికారులు

- సమగ్ర కుల గణనకు అడుగులు శుభపరిణామం
- రౌండ్ టేబుల్ సమావేశంలో మేధావులు, వక్తలు

సీటీఆర్ఐ/రాజమహేంద్రవరం సిటీ: 'కులగణన చారిత్రాత్మక నిర్ణయం.. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు దాటిన అనంతరం సమగ్ర గణనకు ప్రభుత్వం అడుగులు వేయడం శుభపరిణామం. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న విప్లవాత్మక నిర్ణయం రాజకీయ, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి దోహద పడుతుంది. సమ సమాజ స్థాపన కోసం ముందుకు అడుగులు వేయడం సాహసంతో కూడిన అంశం. గణన సమగ్రంగా, పారదర్శకంగా చేపట్టి అన్ని వర్గాల అభ్యున్నతికి నాంది పలకాలి.' అని వివిధ కులాల మేధావులు, వక్తలు అభిప్రాయ పడ్డారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న కుల గణనకు సంబంధించి అన్ని వర్గాల ప్రజల సలహాలు, సూచనలు తీసుకునేందుకు స్థానిక మంజీరా కన్వెన్షన్‌లో కలెక్టర్ కె.మాధవీలత శుక్రవారం ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన 56 బీసీ కులాల సంఘం నాయకులు, మూడు ఎస్సీ సంఘాలు, ఎస్టీ సంఘాలు, మిగిలిన సంఘాలకు చెందిన సుమారు 400 మంది ప్రతినిధులు, మేధావులు, ప్రజలు హాజరయ్యారు. గణనపై తమ సలహాలు, సూచనలు ఇచ్చారు. వాటిని విన్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ , కలెక్టర్ మాధవీలత, ఎంపీ మార్గాని భరత్ రామ్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ గణన సమయంలో తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జేసీ తేజ్ భరత్, కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఆర్‌డీఓ చైత్రవర్షిణి, కొవ్వూరు ఆర్‌డీఓ మల్లిబాబు, రాష్ట్ర గాండ్ల, తెలికల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిస భవానీప్రియ, ఎంబీసీ చైర్మన్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచారం సేకరించాలి



కులగణన ద్వారా సమగ్ర సమాచారం సేకరించాలి. రాజ్యాంగం అందించిన పదవులు, విద్య, ఉద్యోగాల్లో సామాజిక న్యాయం చేసే అవకాశం కుల గణన ద్వారా మాత్రమే సాధ్యం అవుతుంది. కులగణనకు సంబంధించి ఇంత మంది మేధావులు, కుల సంఘాల నాయకులు అభిప్రాయాలు సేకరించడం అభినందనీయం.

– ఇళ్ల వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ

క్రైస్తవులకు గుర్తింపు



కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ముందుగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగిస్తున్నారు. ఆయన అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో క్రైస్తవులకు గుర్తింపు లభించింది. కులగణన చేపట్టడం వల్ల క్రైస్తవులు శాతం ఎంత మంది ఉన్నారో తెలుస్తుంది.

– డాక్టర్ మోజెస్ బాబు, ఏపీ పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు

రాజకీయ లబ్ధి



కులగణన చేపట్టక పోవడం వల్ల యాదవులకు నష్టం జరుగుతోంది. ఇన్నేళ్లుగా యాదవులు సంఖ్య ఎంత ఉందో సుమారుగా చెప్పడం తప్ప.. కచ్చితంగా సమాచారం లేదు. దీనివల్ల యాదవులకు పదవులలో అన్యాయం జరుగుతోంది. కులగణన చేపడితే మాకు రాజకీయ లబ్ధి పొందే అవకాశం ఉంటుంది.

– సూర్యచంద్ర యాదవ్, జిల్లా యాదవ్ అసోసియేషన్ సభ్యుడు

బీసీలకు న్యాయం



కులగణన చేపట్టడం వల్ల బీసీలకు న్యాయం జరుగుతుంది. కులగణన జరగకపోవడం వల్ల బీసీల శాతం తక్కువగా కనబడుతోంది. దీనివల్ల రాజ్యాంగ పరంగా రావాల్సిన హక్కులను కోల్పోతున్నాం. ఇప్పుడు కులగణన చేపట్టడం వల్ల బీసీల శాతం పెరగడమే కాకుండా రాజకీయ పరంగా సీట్లు ఎక్కువగా వస్తాయి.

– శివ ప్రసాద్, అడ్వకేట్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు

భాగస్వాములు చేయాలి



కులగణనలో కులసంఘాల నాయకులను కూడా భాగస్వాములు చేయాలి. దీని వల్ల కుల గణన సర్వే వేగంగా జరుగుతుంది. వలంటీర్లకు స్థానికులు ఏ కులం వారో కొంత తెలుస్తుంది. అదే కుల సంఘాల నాయకులను సర్వేకి తీసుకు వెళ్లడం వల్ల సర్వే తొందరగా పూర్తవుతుంది.

– బి.జార్జ్ ఆంథోనీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ సంఘం నాయకుడు

శుభసూచకం



1948, 58లో కులగణన చేపట్టారు. మళ్లీ ఇప్పుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ కులగణనకు శ్రీకారం చేపట్టడం శుభసూచికం. వర్ణ వ్యవస్థలో వృత్తులు పోయి కులాలు మిగిలాయి. ఇప్పుడు ఎవ్వరు కులవృత్తులు చేస్తున్నారో తెలియడం లేదు. ఈ సమయంలో కులగణన చేపట్టడం అభినందనీయం.

– అశోక్ కుమార్ జైన్, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు

సరైన రిజర్వేషన్లు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. కులగణన అనేది ఇప్పటి వరకూ కలగానే మిగిలిపోయింది. కానీ నేడు సీఎం జగన్ తీసుకున్న నిర్ణయంతో కులాల వారీగా సరైన రిజర్వేషన్లు లభిస్తాయి. ఏ కులం వారు ఎక్కువగా ఉన్నారో, వారికి ఎంత శాతం రిజరేషన్లు అమలు అవుతున్నాయో తెలుసుకునే అవకాశం ఉంటుంది.

– ఎండీ ఆరీఫ్, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్

కులాలకు మేలు



కులగణన చేపట్టడం వల్ల విద్య, ఉద్యోగం, రాజకీయం తదితర అంశాలలో సరైన న్యాయం జరుగుతుంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఎంతశాతం ఉన్నారో కచ్చితంగా తెలుసుకోవచ్చు. తద్వారా ఆయా కులాలకు మేలు జరుగుతుంది.

– దేవరి అంజలి, నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ మహిళా కార్యదర్శి

క్లుప్తంగా

అన్నవరం దేవస్థానం ఈఓగా రామచంద్ర మోహన్



అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారి(ఫుల్ అడిషనల్ చార్జి)గా దేవదాయ, ధర్మాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ శనివారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. తొలుత ఆయనను డెప్యూటేషన్‌పై అన్నవరం దేవస్థానం ఈఓగా నియమించగా అందుకు ఆయన అయిష్టత చూపారు. దీంతో మళ్లీ ఆర్డర్ మార్చి ఫుల్ అడిషనల్ చార్జి ఈఓగా నియమించారు. కాగా, పాత ఈఓ చంద్రశేఖర్ ఆజాద్‌ను తొలుత శ్రీకాళహస్తి ఈఓగా నియమించగా తాజా ఆర్డర్‌లో ఆయనను కమిషనర్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు. శ్రీకాళహస్తి ఇన్‌చార్జి ఈఓగా విజయవాడ దుర్గ గుడి ఈఓ కేఎస్ రామారావును నియమించారు.

నేడు వివిధ నిర్మాణాల పరిశీలన

ఈఓగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం దేవస్థానంలోని వివిధ అభివృద్ధి పనులను రామచంద్ర మోహన్ పరిశీలించనున్నారు. చంద్రశేఖర్ ఆజాద్ ఈఓగా ఉన్న కాలంలో రూ.20 కోట్లతో సుమారు 60 నిర్మాణాలు ప్రారంభించారు. వాటిలో కొన్ని పనులు పూర్తి కాగా, మరికొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. వీటిలో కార్తిక మాసం కోసం నిర్దేశించిన పనులు కూడా ఉన్నాయి. అటువంటి వాటిని వెంటనే పూర్తి చేయించాలని సంబంధిత కాంట్రాక్టర్లను రామచంద్ర మోహన్ ఆదేశించనున్నారు. కార్తిక మాసంతో సంబంధం లేని నిర్మాణాలను తాత్కాలికంగా నిలిపివేసి తరువాత వాటిపై సమీక్షించనున్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

కిర్లంపూడి: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. ఏఎస్సై కె.రామకృష్ణ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. పిఠాపురం మండలం అగ్రహారానికి చెందిన జోగ శివ ఓంకార్ (17) అదే గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ రాజు వద్ద పెయింటింగ్ పని చేస్తుంటాడు. కిర్లంపూడి మండలం బాలరాజు నగర్‌లోని ఓ బిల్డింగ్‌లో గురువారం పని చేయడానికి వచ్చాడు. పని చేస్తున్న సమయంలో గదిలో ఉన్న సీలింగ్ అల్యూమినియం చానల్స్‌ను కిటికీ నుంచి బయటకు వేస్తుండగా అవి ప్రమాదశాత్తూ కరెంట్ తీగలకు తగిలాయి. దీంతో తీవ్రమైన షాక్‌కు గురైన రాజు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించాడు. మృతుడి సోదరుడు జోగ దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై రామకృష్ణ తెలిపారు. మృతుడికి తల్లి, సోదరుడు ఉన్నారు.

ఆయుష్మాన్‌భవ!

- భవనాల ఆధునీకరణకు ప్రణాళికలు
- జిల్లాలోని 23 ఆయుష్ ఆస్పత్రులకు అవకాశం
- డాక్టర్ పోస్టుల భర్తీకి చర్యలు

అమలాపురం టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఆయుర్వేదం, హోమియోపతి వైద్య సేవలు అందించే ఆయుష్ ఆస్పత్రులను పూర్తి స్థాయిలో ఆధునీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆ ఆస్పత్రులకు క్రమం తప్పకుండా ఆయుష్ మందులు సరఫరా చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు భవనాల ఆధునీకరణకు నడుం బిగిస్తోంది. దీనికి ముందే ఆయుష్ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీకి చర్యలు చేపట్టింది.

జిల్లాలోని మొత్తం 23 ఆస్పత్రుల్లో 20 డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మూడు ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో వైద్యులు పని చేస్తున్నారు. 20 ఆస్పత్రుల్లో కేవలం ఐదుచోట్ల మాత్రమే రెగ్యులర్ మెడికల్ ఆఫీసర్లు ఉన్నారు. ఈ ఐదుగురే మిగిలిన ఆస్పత్రుల్లో ఇన్‌చార్జి బాధ్యతలు చేపడుతున్నారు. ఇప్పటికే రాత పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించిన ప్రభుత్వం నెల రోజుల్లో పోస్టులు భర్తీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది.

ఒక్కో భవనానికి రూ.3.50 లక్షలు

రాష్ట్రంలోని 110 ఆయుష్ ఆస్పత్రులకు గాను తొలి దశలో ఒక్కో ఆస్పత్రి భవనాన్ని రూ.3.50 లక్షలతో ఆధునీకరించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. భవిష్యత్ అవసరాలకు ఇబ్బంది లేకుండా రూ.12 కోట్లతో మందులు కొనుగోలు చేసేందుకు చర్యలు చేపడుతోంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఆ ఆధునీకరణ చర్యలను నాడు–నేడు పథకం ద్వారా చేపడుతోంది. జిల్లాలోని ఆయుష్ ఆస్పత్రుల్లో చాలా వాటికి సొంత భవనాలు ఉండగా, మరికొన్ని పీహెచ్‌సీల్లో ఉన్నాయి. ఈ భవనాలకు మరమ్మతులు చేసి ఆధునీకరించనున్నారు. జిల్లాలోని ఆయుష్ ఆస్పత్రి భవనాల్లో అసౌకర్యాలపై ఏలూరులోని ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం ఇప్పటికే నివేదిక కోరింది.



ద్రాక్షారామలోని ప్రభుత్వ హోమియో ఆస్పత్రి భవనం

ఏయే ఆస్పత్రుల్లో ఏయే వైద్యమంటే..

జిల్లాలోని 23 ఆయుష్ ఆస్పత్రులకు గాను తొమ్మిది ఆయుర్వేదం, 13 హోమియోపతి, ఒక యునానీ కేటగిరీ వైద్య సేవలు అందిస్తున్నాయి. వీటిలో ఆత్రేయపురం, అంబాజీపేట, ముమ్మిడివరం, అనాతవరం, కె.జగన్నాథపురం, నరేంద్రపురం, పాశర్లపూడి, పల్లంకుర్రు, తాటిపాక ఆయుర్వేద ఆస్పత్రులుగా ఉన్నాయి. జొన్నాడ, తాపేశ్వరం, వెంటూరు, అమలాపురం, అంతర్వేదిపాలెం, కోటిపల్లి, లక్కవరం, ద్రాక్షారామ, కొమరిగిరిపట్నం, గోపాలపురం, పి.గన్నవరం, బండార్లంక, కేశనకుర్రు హోమియోపతి ఆస్పత్రులుగా ఉన్నాయి. నగరం గ్రామంలోని ఆయుష్ ఆస్పత్రి మాత్రమే యునానీ వైద్యాన్ని అందిస్తోంది. పి.గన్నవరం, బండార్లంక, నగరం ఆస్పత్రుల్లో మాత్రమే కాంట్రాక్ట్ పద్ధతిలో వైద్యులు పని చేస్తున్నారు.

ఆయుష్‌కు మంచి రోజులు వస్తున్నాయి

జిల్లాలోని ఆయుష్ ఆస్పత్రులను ఆయుష్మాన్ భారత్ ద్వారా ఆధునీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేయడం శుభ పరిణామం. ఈ ఆస్పత్రులకు మంచి రోజులు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టడం అభినందనీయం.

– డాక్టర్ శ్యామసుందరరావు, మెడికల్ ఆఫీసర్, ఆయుష్ ఆస్పత్రి, అంబాజీపేట

అదృశ్యమై.. ఆపై శవమై..

- కుళ్లిన స్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యం
- పెద్దాపురంలో కలకలం

పెద్దాపురం: పట్టణ శివారున పాత పెద్దాపురం పాత రాజు చెరువు సమీపాన కళింగల వద్ద కుళ్లిన స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమవడం స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు కథనం ప్రకారం.. కుటుంబ సభ్యుల మధ్య వాగ్వాదం నేపథ్యంలో పట్టణానికి చెందిన బి.సింహం (52) ఈ నెల 13న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మర్నాడు కూడా అతడు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ తెలియకపోవడంతో అతడు అదృశ్యమైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈలోగా పాత పెద్దాపురంలో కుళ్లిన స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు శుక్రవారం సాయంత్రం పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సీఐ వై.రవి కుమార్ అక్కడకు చేరుకున్నారు. ఆ మృతదేహాన్ని గుర్తించాల్సిందిగా సింహం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి, అది సింహం మృతదేహమేనని గుర్తించారు. దీంతో ఆ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. హత్యా, ఆత్మహత్యా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని సీఐ రవికుమార్ తెలిపారు. మృతుడికి భార్య రాజు, కుమారుడు రమేష్ ఉన్నారు.



మృతుడు సింహం (పాత చిత్రం)

కాశీ వెళ్తే ఇల్లు గుల్ల చేశారు

అంబాజీపేట: పుణ్యం కోసం కాశీ వెళ్తే.. దొంగలు ఇల్లు గుల్ల చేశారు. ఈ సంఘటన అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రామంలో జరిగింది. ఏఎస్సై పి.భగవన్నారాయణ కథనం ప్రకారం.. పుల్లేటికుర్రుకు చెందిన అయ్యగారి శివశంకర్ రాజ మహేంద్రవరంలోని ఒక ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్నారు. అక్కడి నుంచి అప్పుడప్పుడు పుల్లేటికుర్రు వచ్చి తన ఇంటి కింద వాటాలో ఉంటూంటారు. ఇంటి పనుల కోసం పని మనిషికి తాళాలు అప్పగించి, కుటుంబ సమేతంగా శివశంకర్ ఈ నెల 2న కాశీ వెళ్లారు. పనులు చేసేందుకు శుక్రవారం వచ్చిన పని మనిషి ఇంటి తలుపులు తెరచి ఉండటాన్ని గమనించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. శివశంకర్ చెప్పిన సమాచారం ప్రకారం ఇంటిని పరిశీలించిన పోలీసులు సుమారు రూ.1.07 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై భగవన్నారాయణ తెలిపారు.

గిరిజన మహా యోధుడు ఏకలవ్యుడు

పిఠాపురం: ఏకలవ్యుడు గిరిజన మహా యోధుడని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు కొనియాడారు. స్థానిక జగ్గయ్య చెరువు కాలనీ బైపాస్ రోడ్డు వద్ద పిఠాపురం ఎరుకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన నిర్మించిన ఏకలవ్యుడి విగ్రహ ప్రతిష్ఠలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జిల్లా ఎరుకుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు భారతి వీరబాబు ఆధ్వర్యాన ఏకలవ్యుడి విగ్రహాన్ని, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ, ఎరుకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడానికి ఎప్పుడూ సహకారం అందిస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఎరుకుల సంక్షేమ సంఘం సభ్యులు పిఠాపురంలో వివిధ వేషధారణలతో నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది.



ఏకలవ్యుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, ఎమ్మెల్యే పెండెం దొరబాబు

• కా కేక !

దేవరపల్లి మండలం చిన్నాయగూడేనికి చెందిన రైతు మార్ని సూర్యచంద్రరావుకు అకస్మాత్తుగా అదృష్టం కలసి వచ్చింది. ఆయన పశువుల శాలలోని ఓ ఆవు రెండో చూలులో కవల పెయ్య దూడలకు జన్మనిచ్చింది. ఇలా రెండు పెయ్య దూడలు జన్మించడం చాల అరుదని, అందునా పవిత్ర కార్తిక మాసంలో తమ ఇంట కవల పెయ్య దూడలు పుట్టడం అదృష్టంగా భావిస్తున్నామని ఆయన ఆనందంగా చెప్పారు.

– దేవరపల్లి



ఆన్‌లైన్ చేసిన రోజునే రైతుకు చెల్లింపు

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఎండీ వీరపాండ్యన్ వెల్లడి
- ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సమీక్ష

ఆలమూరు: రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించి, ఆన్‌లైన్ చేయించుకున్న రోజునే సొమ్ము చెల్లిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జి.వీరపాండ్యన్ అన్నారు. ధాన్యం కొనుగోళ్లు – రైతు సమస్యలపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరులో జిల్లా స్థాయి అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఎండీ వీరపాండ్యన్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎటువంటి సమస్యలూ తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సాంకేతిక సమస్యలు ఎదురైతే సత్వరమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే రూ.50.7 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేశామని, ఇప్పటి వరకూ రూ.40.8 కోట్ల మేర చెల్లింపులు జరిపామని తెలిపారు. జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 1.58 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా 4.8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరుగుతుందని భావిస్తున్నామన్నారు. రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించడం, వ్యయప్రయాసలు లేకుండా సులభతరమైన చెల్లింపులే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని చెప్పారు. ధాన్యం విక్రయించే రైతులకు ఎటువంటి కోతలూ లేకుండా పూర్తి స్థాయి చెల్లింపులు జరిపేలా, రైసుమిల్లుల వద్ద దిగుమతులు సకాలంలో జరిగేలా ఆర్‌బీకేల పర్యవేక్షణలో కస్టోడియన్ అధికారులను నియమించామని వీరపాండ్యన్ వెల్లడించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ, సహకార, రవాణా, తూనికలు – కొలతల అధికారులు ఓలేటి బోసుబాబు, ఎ.రాధాకృష్ణ, డి.అశోక్ ప్రతాపరావు, కె.రాజేష్, కొత్తపేట ఆర్‌డీఓ ఎం.ముక్కంటి, డీఎస్పీ కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలుపై జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న వీరపాండ్యన్

రైతులకు సమర్థంగా సేవలందించాలి

గ్రామ సచివాలయాల్లోని వ్యవసాయ క్షేత్ర సహాయకులు మరింత సమర్థంగా విధులు నిర్వహించి, రైతుల అభ్యున్నతికి కృషి చేయాలని వీరపాండ్యన్ సూచించారు. ఆలమూరు ఆర్‌బీకేలో సిబ్బందితో ఆయన మాట్లాడారు. రైతుల వివరాలను వ్యవసాయ క్షేత్ర సహాయకులు నేరుగా కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. జిల్లాలో ఖరీఫ్ సాగు వివరాలను జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబును అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని 374 ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిధిలో ఇప్పటి వరకూ 16,316 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయన్నారు. రైతుల నుంచి 3,438 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా క్వింటాల్‌కు రూ.2,182.50 చెల్లిస్తున్నామని చెప్పారు. జిల్లాలో 5.09 లక్షల గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని బోసుబాబు వెల్లడించారు. అనంతరం స్థానిక రైతుల సందేహాలను వీరపాండ్యన్ నివృత్తి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఐపీ శెట్టి, ఏడీఏ కాకి నాగేశ్వరరావు, వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీ లావణ్య, సర్పంచ్ నాతి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు



కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఖోఖో పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–17 ఖోఖో బాలురు, బాలికల పోటీలు రెండో రోజైన శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. స్థానిక జిల్లా క్రీడా మైదానం, జేఎన్‌టీయూకే క్రీడా మైదానాల్లో ఈ పోటీలు జరుగుతున్నాయి. బాలుర విభాగంలో కృష్ణా, విశాఖపట్నం, చిత్తూరు, డాక్టర్ వైఎస్సార్ కడప, శ్రీకాకుళం, కర్నూలు జట్లు.. బాలికల విభాగంలో శ్రీకాకుళం, చిత్తూరు, ప్రకాశం, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, నెల్లూరు, అనంతపురం జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. తూర్పు గోదావరి బాలురు, బాలికల జట్లు క్వార్టర్ ఫైనల్స్‌లో విజయం సాధించి సెమీస్‌లో స్థానం పొందాయి. సాయంత్రం నిర్వహించిన మ్యాచ్‌లలో పాల్గొంటున్న క్రీడాకారులను కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్ పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. పోటీలను నిర్వహణ కార్యదర్శి ప్రసాద్, సహాయ నిర్వహణ కార్యదర్శి పట్టాభి పర్యవేక్షించారు.

నన్నయ మెన్ ఖోఖో పోటీలు ప్రారంభం



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

అనపర్తి: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ మెన్ ఖోఖో ఎంపిక పోటీలు స్థానిక జీబీఆర్ విద్యా సంస్థల ప్రాంగణంలో శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. గోపన్నపాలెం ఎస్ఎస్‌జీపీసీ, కాకినాడ ఐడియల్, పీఆర్ డిగ్రీ, రాజమహేంద్రవరం ఆర్ట్స్, ఏలూరు సీఆర్ రెడ్డి, రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన ఆరు జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. రెండు రోజుల పోటీల అనంతరం శనివారం తుది జట్టు ఎంపిక జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జీబీఆర్ విద్యాసంస్థల పాలక మండలి సభ్యుడు గొలుగూరి రామారెడ్డి, డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎన్‌పీ అబ్బాయిరెడ్డి, పీఆర్ఎల్ స్వామి, సెలక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ నరసింహరాజు, దుర్గాప్రసాద్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) కోచ్ పాపారావు, జీబీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డీన్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీపిల్లల అదృశ్యం

అంబాజీపేట: తొండవరం గ్రామానికి చెందిన తల్లీపిల్లలు అదృశ్యమయ్యారంటూ వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన పులిదిండి శ్రీనివాసరావు ఈ నెల 11న పనికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చాడు. ఇంట్లో భార్య, 13 ఏళ్ల బాలిక, మూడేళ్ల బాలుడు కనిపించలేదు. ఎంతసేపటికీ వారు రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్ల వద్ద వెతికాడు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై వై.సూర్యనారాయణ తెలిపారు.

ప్రభుత్వ పాలనపై ఢిల్లీ అధికారుల పరిశీలన



కలెక్టర్ కృతికా శుక్లాను కలిసిన ఢిల్లీ సెక్రటేరియట్ ఏఎస్ఓలు

కాకినాడ సిటీ: ఢిల్లీ సెక్రటేరియట్‌లో అసిస్టెంట్ సెక్షన్ అధికారులు(ఏఎస్ఓ)గా ఎంపికైన పలువురు కాకినాడ జిల్లాలో పర్యటిస్తున్నారు. 'విలేజ్ అటాచ్‌మెంట్–భారత్ దర్శన్' కింద ఫౌండేషన్ ట్రైనింగ్‌లో భాగంగా వారు స్టడీ ఈ టూర్ నిర్వహిస్తున్నారు. జిల్లాలోని జి.మేడపాడు, జగ్గంపేట, తాళ్లరేవు గ్రామ పంచాయతీలను వారు మూడు రోజుల పాటు సందర్శించారు. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ/వార్డు సచివాలయ, వలంటీర్ వ్యవస్థల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాలుగో రోజైన శుక్రవారం కాకినాడలోని కలెక్టరేట్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ కార్యాలయాలను ఢిల్లీ ఏఎస్ఓలు సందర్శించారు. జెడ్పీ పరిపాలన, ప్రభుత్వ పథకాల అమలు తీరుపై అధ్యయనం చేసిన అనంతరం కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎ.రమణారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బిల్లు చెల్లించనందుకు విద్యుత్ కనెక్షన్ కట్

- లైన్‌మన్‌పై వినియోగదారుడి దాడి
- పోలీసు కేసు నమోదు

అల్లవరం/అమలాపురం రూరల్: కొద్ది నెలలుగా కరెంటు బిల్లు చెల్లించడం లేదు.. విద్యుత్ సిబ్బంది పదేపదే చెబుతున్నా పట్టించుకోవడం లేదు.. దీంతో నిబంధనల ప్రకారం విద్యుత్ కనెక్షన్ తొలగించేందుకు అసిస్టెంట్ లైన్‌మన్ అక్కడకు వెళ్లాడు. అతడిపై ఓ వినియోగదారుడు తీవ్ర స్థాయిలో దాడికి ఒడిగట్టి, గాయపరిచాడు. ఈ సంఘటన అల్లవరం మండలం బోడసకుర్రు పంచాయతీ పరిధి బోడసకుర్రు పల్లిపాలెంలో శుక్రవారం చోటు చేసుకుంది. విద్యుత్ అధికారులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొప్పాడి రఘువర్మ రెండు నెలలుగా తన ఇంటి కరెంటు బిల్లు చెల్లించడం లేదు. ఏపీ ఈపీడీసీఎల్‌కు రూ.400 బకాయి పడ్డాడు. ఈ బకాయి చెల్లించాల్సిందిగా ఈపీడీసీఎల్ సిబ్బంది దఫదఫాలుగా రఘువర్మకు చెప్పారు. అయినప్పటికీ బిల్లు చెల్లించడం లేదు. ఈ నేపథ్యంలో నిబంధనల ప్రకారం విద్యుత్ కనెక్షన్ తొలగించేందుకు అసిస్టెంట్ లైన్‌మన్ కడలి నాగార్జున శుక్రవారం రఘువర్మ ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో అతడిని రఘువర్మ అసభ్య పదజాలంతో దూషిస్తూ ఒక్కసారిగా దాడికి దిగాడు. ఒక్కసారిగా నెట్టివేయడంతో నాగార్జున కింద పడిపోయాడు. ముక్కు, చెవి నుంచి రక్తం కారడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతడిని వెంటనే అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. ఈ దాడిపై ఇన్‌చార్జి ఏఈ హరిబాబు అల్లవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై జంగా సత్యనారాయణ తెలిపారు. అసిస్టెంట్ లైన్‌మన్ నాగార్జునపై దాడిని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ మోకా రవికుమార్ తీవ్రంగా ఖండించారు. విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ కార్మికుడిపై దాడి చేయడం నేరమని పేర్కొన్నారు. వినియోగదారుడు రఘువర్మ బిల్లులు చెల్లించకపోవడంతో ఆయన విద్యుత్ కనెక్షన్ డీఫాల్ట్ అయ్యిందని తెలిపారు. బకాయి, ప్రస్తుత బిల్లు కలిపి రీకనెక్షన్ ఫీజు రూ.100తో కలిపి చెల్లించాలని, బిల్లుపై ఉన్న గడువు తేదీ వారికి వర్తించదని రవికుమార్ స్పష్టం చేశారు.



దాడిలో గాయపడిన నాగార్జున

భార్యా హంతకుడికి జీవిత ఖైదు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అనుమానంతో భార్యను హత్య చేసిన ఘటనలో ముద్దాయి గుడె శ్రీనుకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ పదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎం.నాగేశ్వరరావు శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలివీ.. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలేనికి చెందిన గుడె శ్రీనుకు ఝాన్సీకి 2009లో వివాహమైంది. వీరికి ఇద్దరు మగపిల్లలు. భార్యాపిల్లలతో కలిసి శ్రీను స్థానిక తుమ్మలావ ప్రాంతంలోని ఒక ఇంట్లో అద్దెకుండేవాడు. నిత్యం మద్యం తాగి వచ్చి భార్యను హింసించేవాడు, ఆమెను అనుమానిస్తూ ప్రతి రోజూ గొడవపడేవాడు. ఈ నేపథ్యంలో 2015 సెప్టెంబర్ 28వ తేదీ రాత్రి ఆమె టైలరింగ్‌కు ఉపయోగించే కత్తెరతో మెడపై పొడిచి హత్య చేశాడు. ఈ సంఘటనపై అప్పటి త్రీటౌన్ ఎస్సై రామకోటేశ్వరరావు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో శ్రీనుపై నేరం నిరూపణ అవడంతో న్యాయమూర్తి జీవిత ఖైదుతో పాటు రూ.1,000 జరిమానా విధించారు. ఈ కేసులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకటరత్నం ప్రాసిక్యూషన్ నిర్వహించారు. త్రీటౌన్ సీఐ పి.వీరయ్యగౌడ్ కేసు పర్యవేక్షించగా, కోర్టు కానిస్టేబుల్ ఎస్.వెంకటేశ్వరావు సాక్షులను ప్రవేశపెట్టారు.